

సాక్షి బాపట్ల

శనివారం । 21 । జనవరి । 2023



పశ్చిమకు 1416 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ కాలువకు శుక్రవారం 1416 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. వీటిని వేర్వేరు కెనాల్స్ పంపిణీ చేశారు.



పులిచింతలలో 43 టీఎంసీలు

అచ్చంపేట: పులిచింతలలో ప్రస్తుత నీటి నిల్వ 43.2071 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 6709 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 వదులుతున్నారు.

జీరో కరోనా



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

ప్రతిభాపాటవాలు పెంచేందుకే పీఎం–శ్రీ కార్యక్రమం

స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ పార్వతి



నాదెండ్ల: విద్యలో మరింత శాస్త్రీయత, ఆధునికత జోడించి విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలు పెంపొందించేందుకు పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం–శ్రీ) కార్యక్రమం అమలు చేస్తున్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ వి.పార్వతి చెప్పారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి పీఎం–శ్రీ కార్యక్రమం అమలు కానున్నట్లు తెలిపారు. ఈ పథకానికి సంబంధించి డాక్యుమెంట్ వెరిఫికేషన్ నిమిత్తం జిల్లావ్యాప్తంగా ఆమె సందర్శించారు. స్కూలు, విద్యార్థుల వివరాలు నమోదు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా రూ.27360 కోట్లతో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐదేళ్ల పాటు ఈ పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య, మరింత మెరుగైన వసతులు, అంతర్జాతీయ ప్రమాణాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. హెచ్ఎం వీవీఎంఈ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఏపీసీగా విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్తగా డెప్యూటీ కలెక్టర్ కేడర్‌లో ఉన్న జి.విజయలక్ష్మిని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

పులిచింతల స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా శ్రీరాములు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కందుల శ్రీరాములును నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్) నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న శ్రీరాములు పదోన్నతిపై స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఇదే విధంగా పల్నాడు జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న కె.మాధురి బదిలీ అయ్యారు.

కేఆర్ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్‌గా వెంకట శివరామిరెడ్డి


గుంటూరు వెస్ట్: రాష్ట్రంలోని పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు కేఆర్ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్‌గా వెంకట శివరామిరెడ్డిని నియమించారు. ఇటీవల జిల్లా నుంచి పదోన్నతి పొందిన పెండుల ప్రభాకర్‌ను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ రెవెన్యూ విభాగానికి బదిలీ చేశారు. వాకా శ్రీనివాసులురెడ్డిని విజయవాడ టూరిజం రీజనల్ డైరెక్టర్‌కు బదిలీ చేశారు.

యార్డులో 75,897 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): స్థానిక మిర్చియార్డుకు శుక్రవారం 70,514 మిర్చి బస్తాలు రాగా, గతవారం నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 75,897 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.28,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 35,141 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 572.40 అడుగుల వద్ద ఉంది. ఇది 262.5944 టీఎంసీలకు సమానం గా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,567, ఎడమకాలువకు 6,478, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 8,778, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లో 28,543 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 28,543 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 845.30 అడుగుల వద్ద ఉంది. ఇది 70.6282 టీఎంసీలకు సమానం.

జయహో భవన్

పల్లెలకు ప్రాధాన్యం

- శరవేగంగా నిర్మాణ పనులు
- 459 పంచాయతీల్లో 1334 భవనాలు
- ఇప్పటికే 86 సచివాలయాలు, 50 రైతుభరోసా కేంద్రాలు ప్రారంభం
- మార్చినాటికి మిగిలినవి పూర్తిచేసేందుకు ప్రత్యేక చర్యలు

బాపట్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాధాన్యత భవనాలతో పల్లెలు ప్రత్యేక శోభను సంతరించుకుంటున్నాయి. పల్లె ప్రజలకు అవసరమైన అన్నిరకాల సేవలను అందుబాటులో ఉంచేందుకు గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, బల్క్ మిల్క్ యూనిట్లు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. జిల్లాలో మొత్తం 459 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిల్లో 1334 ప్రాధాన్యత భవనాలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో భవన నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఆయా గ్రామాల్లో ఆధునాతన సౌకర్యాలతో ఐదు భవనాలు నిర్మించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. అందులో భాగంగా ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిర్ణీత సమయంలోగా వీటిని పూర్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం విశేష కృషి చేస్తోంది.

శరవేగంగా నిర్మాణపనులు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రాధాన్యత భవన నిర్మాణాలను వేగం పెంచేందుకు వారంలో మూడు రోజులు రాష్ట్ర స్థాయి అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో వీడియో, టెలీ కాన్ఫరెన్సులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్మాణాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం అవసరమైన చర్యలను చేపట్టింది. ఒక్కో భవనానికి ఎంత వెచ్చిస్తున్నారంటే.. గ్రామ సచివాలయానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ రూ.17.50 లక్షలు, బల్క్ మిల్క్ కూలింగ్ రూ.18.02 లక్షలు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీకి రూ.16.25 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.



అడవి పంచాయతీలో ప్రారంభించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం



ముత్తాయపాలెంలో నూతనంగా ప్రారంభించిన గ్రామ సచివాలయ భవనం

జిల్లా సమాచారం

భవనాలు	మంజూరు	అంచనామొత్తం రూ.కోట్లలో	పూర్తిచేసినవి	వివిధదశల్లో ఉన్నవి
గ్రామసచివాలయాలు	401	149.29	86	315
రైతు భరోసా కేంద్రాలు	315	69.54	50	265
వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలు	343	60.66	29	314
బల్క్‌మిల్క్ యూనిట్లు	146	12.33	01	145
వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు	129	16.03	--	129

అభివృద్ధి పనులకు రూ.69.21 కోట్లు ఖర్చు

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఇప్పటికే రూ.71.71 కోట్లు ఖర్చుచేశారు. గ్రామ సచివాలయాలకు రూ.42 కోట్లు, రైతుభరోసా కేంద్రాలకు రూ.11.04 కోట్లు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లకు రూ.9.77 కోట్లు, బల్క్‌మిల్క్ యూనిట్లకు రూ.9 లక్షలు ఖర్చుచేశారు. వీటితోపాటు సీసీ రోడ్ల నిర్మాణాలకు జిల్లాలో 350 పనులకుగాను రూ.14.32 కోట్లు కేటాయించగా ఇప్పటికే 26 పనులు పూర్తిచేసి రూ.కోటి ఖర్చు చేశారు. ఎంపీ నిధులతో 84 పనులు గుర్తించి వాటిల్లో ఇప్పటికే 47 పనులు పూర్తిచేసి రూ.4.5 కోట్లు ఖర్చుచేశారు.

మార్చి నాటికి పూర్తిచేసేందుకు చర్యలు



జిల్లాలో చేపట్టిన ప్రాధాన్యత భవన నిర్మాణాలను మార్చి నాటికి పూర్తిచేసే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాం. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల ఏఈలతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నాం. అధిక శాతం భవనాలు ఫినిష్సింగ్ స్టేజీలో ఉన్నాయి. వాటిని త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని ప్రాంతాల్లో వర్షాల కారణంగా మొదలు పెట్టని భవనాలను త్వరితగతిన ప్రారంభించేలా చూస్తున్నాం. –ఎ.శ్రీనివాస్, ఎస్ఈ, పంచాయతీరాజ్

గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారు



గతంలో మా గ్రామంలో పంచాయతీ కార్యాలయం మాత్రమే ఉండేది. ప్రస్తుతం మా గ్రామంలో గ్రామ సచివాలయం ప్రారంభించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రం పనులు జరుగుతున్నాయి. వీటితోపాటు గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతుభరోసా కేంద్రం ఏర్పాటుచేసి రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచారు. – విడాలపు శ్రీనివాసరావు, ముత్తాయపాలెం

అన్ని వసతులు ఉన్నాయి



పంచాయతీ కార్యాలయంలో సేవలు అందించేవాళ్లం. చిన్నగదులు కావడంతో చాలా ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం నూతనంగా ప్రారంభించిన గ్రామ సచివాలయ భవనం విశాలంగా ఉంది. సచివాలయ ఉద్యోగులకు కావాల్సిన అన్నిరకాల వసతులు అందుబాటులో ఉన్నాయి. గ్రామస్తులకు కూడా అన్నిరకాల సేవలను సత్వరమే అందించగలుగుతున్నాం. – కిరణ్, డిజిటల్ అసిస్టెంట్, ముత్తాయపాలెం

కానిస్టేబుల్ పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లాలో 15 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షలకు హాజరుకానున్న 8567 మంది అభ్యర్థులు

బాపట్లటౌన్: బాపట్ల జిల్లాలో ఆదివారం నిర్వహించే కానిస్టేబుల్ రాత పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షకు 8,567 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. అభ్యర్థులను ఉదయం 9 నుంచి 10 గంటలలోపు కేంద్రాలలోకి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్, ప్రింటింగ్, కోచింగ్ సెంటర్లు, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్స్ షాపులను ఉదయం 8 నుంచి సాయంత్రం ఒంటి గంట వరకు మూసివేయించేలా పోలీసులు చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల వద్ద సీసీ కెమెరాలు నిఘాను పటిష్టం చేశారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు నిషిద్ధ ప్రదేశంగా భావించి 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

ఇంద్రకీలాద్రిపై సరస్వతీ యాగం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మూల నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సరస్వతీ యాగం చేశారు. విద్యార్థులకు పెన్నులు, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

తిరుపతమ్మ ఆలయ ఈఓగా రమేష్‌నాయుడు



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ ఆలయ ఈఓగా రెవెన్యూ (ఎండోమెంట్)లో పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె. రమేష్‌నాయుడును నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం ఆలయ ఈఓగా పనిచేస్తున్న జీవీడీఎన్ లీలాకుమార్ తిరిగి మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ విద్య పరిషత్ అసిస్టెంట్ కమిషనర్‌గా వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు.

పవర్ చూపుతున్న జ్యోతి

- పవర్‌లిఫ్టింగ్‌లో వరుస పతకాలు ● అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక ● మూడేళ్లుగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారు, వెండి పతకాలు

బల్లికురవ: విద్యతోపాటు క్రీడల్లోనూ పవర్ చూపుతోంది జ్యోతి. రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్‌లో బంగారు, వెండి పతకాలను సాధిస్తూ ప్రశంసలు అందుకుంటుంది. త్వరలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామానికి చెందిన మేడగం శ్రీనివాసరెడ్డి, రమాదేవి దంపతుల కుమార్తె జ్యోతి బాల్యం నుంచే చదువుతోపాటు క్రీడలోనూ ఆసక్తి కనబర్చింది. మార్టూరు మండలం వలపర్లలో ప్రాథమిక విద్య ఉన్నత విద్య, మండలంలోని పెద అంబడిపూడి ఉన్నత పాఠశాలలో 2017–18 పదో తరగతిలో పదికి పది జీపీఏ సాధించి వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ప్రస్తుతం ఈసీఈ మూడో సంవత్సరం చదువుతోంది. కళాశాలలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, కోచ్ డాక్టర్ బాలగోవింద తివారి ప్రోత్సాహంతో పవర్ లిఫ్టింగ్‌లో పతకాలతో రాణిస్తోంది. కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో 2021 నవంబర్, డిసెంబర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎనిమిదో సబ్‌జూనియర్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్‌లో రెండు బంగారు పతకాలు, ఆ తరువాత విశాఖపట్టణంలో జరిగిన ప్రీమియర్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్‌లో 49 కిలోల విభాగంలో బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకుంది.



ఔరంగాబాద్‌లో జరిగిన పోటీల్లో పతకాలు కైవసం చేసుకున్న జ్యోతి

జాతీయ స్థాయిలోనూ పతకాలు

2022 ఆగస్టులో కేరళ రాష్ట్రం కాసరగోడ్‌లో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో జూనియర్స్ 43 కిలోల విభాగంలో బంగారు, వెండి, కాంస్య పతకాలు కైవసం చేసుకుంది. జనవరి 15 నుంచి 20 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగిన పోటీల్లో 43 కిలోల జూనియర్ విభాగంలో రెండు వెండి పతకాలు, ఎక్విప్డ్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్, క్లాసిక్ బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. త్వరలో జరిగే అంతర్జాతీయ పోటీలకు జ్యోతి ఎంపికైంది.

ఆర్థిక స్థోమత లేక వెళ్లలేకపోయా..



గతంలో ఢిల్లీలో జరిగిన పోటీలకు ఎంపికై నా ఆర్థిక స్థోమత లేక వెళ్లలేక పోయా. త్వరలో జరిగే ఇంటర్నేషనల్ పోటీలకు వెళ్లేందుకు రూ.2.5 లక్షలు ఖర్చు అవుతుంది. ఎవరైనా స్పాన్సర్ చేస్తే వెళ్లి సత్తా చాటుతాను. –జ్యోతి, పవర్ లిఫ్టర్

పలువురి అభినందనలు

జ్యోతి ప్రతిభకు అంతా ముగ్ధులవుతున్నారు. వైస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కాపునెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణచైతన్య, మండల కన్వీనర్ చింతల పేరయ్య, వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మండాల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మండా మోహనరావు, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, తహసీల్దార్ సీతారత్నం జ్యోతికి అభినందనలు తెలిపారు.

నేడు వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి రాక ● ఏర్పాట్లు పూర్తి: డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు

బాపట్ల: ప్లాటినం జూబ్లీ వేడుకలకు బాపట్ల వ్యవసాయ కళాశాల ముస్తాబైంది. ఆహ్వాన పత్రికలను కళాశాలలో డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. కళాశాల డీన్ మాట్లాడుతూ శనివారం జరిగే ఉత్సవాలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటున్నారని తెలిపారు. మొత్తం 1200 మంది పూర్వవిద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. కళాశాల ప్రారంభించి 75సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఒక్కొక్క సంవత్సరానికి సంబంధించిన విద్యార్థితో కళాశాల ప్రాంగణంలో ఒక కొబ్బరి మొక్కను నాటించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో తయారు చేసిన బీపీటీ 5204 వరి ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 32రకాల వ్యవసాయ, ఫర్టిలైజర్, విత్తన, వ్యవసాయ యంత్ర పరికరాలతో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. యూనివర్సిటీ హెడ్ డాక్టర్ బి.విజయాభినందన, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు యామిని లీల, యామిని, స్నేహ, శేఖర్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు

జంట హత్యల కేసులో నిందితుడు ఆత్మహత్య

బల్లికురవ: మండలంలోని వేమవరం గ్రామంలో జరిగిన జంటహత్యల కేసులో నిందితుడు గొట్టిపాటి వీరాంజనేయులు (36) శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలలోకి వెళితే.. 2017 మే నెలలో గ్రామానికి చెందిన గోరంట్ల అంజయ్య, వేణునాటి రామకోటేశ్వరరావు హత్య కేసులో వీరాంజనేయులు నిందితుడు. కోర్టు వాయిదాలకు తిరుగుతూ చిలకలూరిపేటలో మకాం ఉంటూ అక్కడే వ్యాపారం చేసుకుంటూ జీవనాన్ని వెళ్లదీస్తున్నాడు. శుక్రవారం కోర్టు కేసు వాయిదాకు ఒంగోలు వెళ్లి తిరిగి వచ్చి జీవితంపై విరక్తితో చిలకలూరిపేటలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీరాంజనేయులు భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు.

చక్కని దస్తూరీతో మార్కులు పదిలం

- టెన్త్ విద్యార్థులకు నిపుణుల సూచన
- బాపట్ల జిల్లాలో 334 ఉన్నత పాఠశాలలు
- పరీక్షలకు సిద్ధమవుతున్న 17,288 మంది విద్యార్థులు

భట్టిప్రోలు: విద్యార్థుల్లో పరీక్షల 'టెన్‌షన్' మొదలైంది. తెలిసిన సమాధానాలే అయినా వాటిని పేపర్‌పై రాయడంలో కొందరు తికమక పడుతుంటారు. తెలిసిన సమాధానాలకు సరిగా రాయకపోవడంతో వెనుకబడి పోతుంటారు. ఆ కారణం.. తమకు పరీక్షలో ఎదురైన ప్రశ్నలకు సరిగా రాయలేక పోతుంటారు. మరికొందరు చేతిరాత బాగాలేక మార్కులు కోల్పోతుంటారు. వచ్చిన సమాధానాలను సరిగా రాయలేకపోవడమే. ఈ చిన్న ఆటంకాలను అధిగమిస్తే విజయం వారి సొంతమవుతుంది. బాపట్ల జిల్లా పరిధిలో 334 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల నుంచి ఈ విద్యా సంవత్సరం 17,288 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నిపుణులు కొన్ని సూచనలు చేశారు. ప్రధానంగా దస్తూరీని మెరుగుపరుచుకోవాలని సూచిస్తున్నారు.



నోట్‌బుక్స్ రాస్తున్న విద్యార్థులు

అక్షరం బాగుంటేనే విజయం మీదే

ఓ విద్యార్థి చేతి రాతను బట్టి సంబంధిత విషయంపై అతని అవగాహన స్థాయిని ఇట్టే చెప్పవచ్చు. పరీక్షలు రాసే విద్యార్థులు ఎంత తెలివైన వారైనా జవాబు పత్రాలు దిద్దేవారికి తెలియదు. వారు రాసే తీరు అక్షరాల కూర్పును బట్టి వారి జ్ఞానాన్ని అంచనా వేస్తారు. కంటికి ఇంపుగా కనిపించే అక్షరాలు మూల్యాంకనం చేసేవారిని ఆకట్టుకుంటాయి. ఇది మంచి మార్కులు పడేందుకు దోహదపడుతుంది.


ఇవి గుర్తుంచుకోండి..

- కొందరు విద్యార్థులు ఒక జవాబు పత్రంపై 25–30 లైన్లు రాస్తారు. దీనివల్ల గజిబిజిగా దగ్గరదగ్గరగా ఉండటంతో జవాబు పత్రం చూడగానే ఆకట్టుకోదు. అందువల్ల ఒక్కో పేజీలో 16–18 లైన్లకు మించకుండా చూడాలి.
- లైన్లు సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి. సౌధ్యమైనంత వరకు పదాలను ఒకే లైన్లోనే వచ్చేలా రాయాలి.
- చాలా మంది విద్యార్థులు ఒత్తి పట్టి రాస్తుంటారు. కలాన్ని వేళ్లతో బిగుతుగా పట్టుకుంటారు. దీంతో పేజీ రెండో వైపు ఆ అక్షరాలు కనిపిస్తూ దీనికి జవాబు పత్రాలు గజిబిజిగా తయారవుతాయి. పెన్నుని మరీ బిగువుగా పట్టుకోకుండా కాగితానికి కొద్దిగా తాకేలా పెట్టి రాయాలి. ఇలా చేయడం వల్ల వేళ్ల నొప్పి తగ్గుతుంది.
- చాలా మంది విద్యార్థులు అంకెలను సరిగా రాయరు. 2 అంకెను ఇంగ్లిష్‌లో జెడ్ మాదిరిగా, 5ను ఎస్‌లా 0ను 6 తరహాలో రాస్తుంటారు. ఫలితంగా రావాల్సిన మార్కులు తగ్గిపోతాయి.
- చాలా మంది విద్యార్థులు ఇంగ్లిష్ 'a' పై చుక్క 'జ' అక్షరంపై గీత వేయరు. తెలుగులో ణ, మ, య సరిగా రాయరు. అక్షరాలన్నీ సరిగా రాయాలి.
- జవాబు పత్రంలో ఏమైనా తప్పులు రాస్తే వాటిని పెన్సిల్, పెన్నుతో బాగా రుద్దుతారు. దీంతో పేపరంతా నల్లగా మారుతుంది. స్కెచ్ పెన్సిల్‌ను పలు రంగుల రీఫిల్స్‌ను అర్థవంతంగా ఉపయోగిస్తుంటారు. ఇది మంచిది కాదు. అవసరమైన చోట ఉపయోగిస్తే అందంగా ఉంటుంది.
- సైన్స్‌లో బొమ్మలను గీస్తే ఆ చిత్రంలోని భాగాలను గుర్తించడం కోసం ఒక క్రమ పద్ధతి పాటించాలి.

ఇలా రాస్తే మంచిది

- విద్యార్థులు ప్రశ్నలను ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకున్నాకే రాయడం మొదలెట్టాలి.
- సమాధానపత్రంలో పేజీకి పైన, కింద మార్జిన్ విడిచి పెట్టాలి.
- మొదటి పదానికి ఎంత బాగా రాశారో చివరి వరకు అదే దస్తూరిని కొనసాగించాలి.
- తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్ట్‌లలో లెటర్ రైటింగ్‌ను ఒకే పేజీలో వచ్చేలా రాయాలి.
- గణితంలో అంకెలు స్పష్టంగా ఉండాలి.
- కొట్టి వేతలు ఎక్కువ మార్కులు తగ్గతాయని గమనించాలి.
- గ్రాఫ్‌ను చక్కగా గీయాలి. సైన్స్‌లో బొమ్మలు గీసేటప్పుడు కష్టమైన వాటిని వదిలేసి సులభంగా ఉన్నవాటిని ఆకర్షణీయంగా గీయాలి.
- సాంఘిక శాస్త్రం సబ్జెక్టులో, సమాధానాలను, పాయింట్ల వారీగా రాయాలి.
- శీర్షికలు, ఉప శీర్షికల కింద అండర్‌లైన్ చేయాలి.

మూల్యాంకనంలో ప్రాధాన్యం



మంచి దస్తూరికి మూల్యాంకనంలో ప్రాధాన్యం ఉంటుంది. చక్కగా రాసిన వారికి మంచి మార్కులు వస్తాయి. తప్పులు, కొట్టివేతలు లేకుండా రాయాలి. అలాగని దస్తూరి బాగా ఉండి సమాధానాలు సరిగా లేకున్నా మార్కులు పడతాయని అనుకోవద్దు. మంచి దస్తూరి అదనపు హంగు అవుతుంది. సాధ్యమైనంత వరకు మెరుగ్గా రాసే యత్నం చేస్తే మంచి మార్కులు వస్తాయి. – వి.నాగేశ్వరరావు, హెచ్ఎం జెడ్పీహెచ్ఎస్ (పల్లికోన)

అదనపు మార్కులకు అవకాశం



అందమైన దస్తూరీ మూల్యాంకనం చేసే వారిని ప్రభావితం చేస్తుంది. చాలా మంది కష్టపడి చదువుతారు. కానీ బాగా రాయక పోవడంతో అనుకున్న మార్కులు సాధించలేకపోతున్నారు. అందుకే చిన్నతనం నుంచి దస్తూరీపై ప్రత్యేక సాధన చేస్తే మంచిది. –సీహెచ్ రామ కోటేశ్వరరావు, హెచ్ఎం (టీఎంఆర్‌హెచ్ఎస్–భట్టిప్రోలు)

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ రేపు

SAKSHI · SAKSHI DIGITAL MEDIA GROUP · SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

APMDC · APMDC FOUNDATION

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

9703013015, 9912671555

District sponsor

VIVA THE SCHOOL BY VVIT

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది

ఎమ్మెల్సీ పోతుల సునీత



చీరాల రూరల్: రాష్ట్రాల ఆర్థిక వ్యవహారాలు, బడ్జెట్‌లు వంటి విషయాల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్యయన నివేదికల్లో మన రాష్ట్రం దేశంలోనే అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కంటే అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె కొత్తపేటలోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆర్బీఐ తన నివేదికలో పొందుపరిచిన ప్రగతి విషయాలను ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన పచ్చ మీడియా మాత్రం రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని దొంగ ఏడుపులు ఏడుస్తూ గగ్గోలు పెడుతుందని విమర్శించారు. చంద్రబాబుతోపాటు పవన్ కల్యాణ్ ఆయన పచ్చ బ్యాచ్ కలసి కొన్ని డబ్బా పత్రికలతో ఇష్టానురీతిగా తప్పుడు రాతలు రాయిస్తూ పైశాచికానందం పొందుతున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కష్టపడుతూ మన రాష్ట్రాన్ని ముందడుగు వేయిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు వెన్నులో వణుకుపుడుతుందని ఎద్దేవా చేశారు.

పరిశ్రమలశాఖ రుణాలపై అవగాహన సదస్సు

నరసరావుపేటఈస్ట్: అర్హత కలిగిన నిరుద్యోగ యువత పరిశ్రమలు, వ్యాపారాలు నిర్వహించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలను అందించి ప్రోత్సహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమలశాఖ జేడీ వెంకటేశ్వరరావు తెలిపారు. వాసవి డిగ్రీ కళాశాలలో శుక్రవారం పరిశ్రమలశాఖ అందించే రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ పీఎం ఉపాధి కల్పన, డాక్టర్ వైఎస్సార్ బడుగువర్గాల రుణ పథకాలపై అవగాహన కల్పించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బి.దాస్ ఉన్నారు.

చంద్రబాబువి పగటి కలలు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: చంద్రబాబు అండ్‌కో పగటి కలలు కంటున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని పల్లపట్ల గ్రామంలో మోపిదేవి విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుకు ముఖ్యమంత్రి పీఠం దోచుకోవటానికి దాచుకోవడానికి మాత్రమే ఉపయోగపడిందన్నారు. పోలీసులపై అయ్యన్నపాత్రుడు హోంశాఖ మంత్రిగా ఊహించుకుని అధికారంలోకి రాగానే మా మాట వినని పోలీసులను గుడ్డలూడదీసి కొడతానని చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. పిచ్చివేషాలు వేస్తే రానున్న రోజుల్లో అయ్యన్నపాత్రుడ్ని గుడ్డలూడదీసి కొడతారని హెచ్చరించారు. పేదల సంక్షేమాన్ని విస్మరించి పాలన చేసిన చంద్రబాబును ప్రజలు తీవ్రస్థాయిలో తిరస్కరించారని గుర్తుచేశారు. చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాలు అందుకోవాలంటే టీడీపీ నాయకుల ఇళ్ల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నేటికీ పేదలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రప్రథమంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థలను రూపొందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇంటికి చేరేవిధంగా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. పేదలకు సంక్షేమ పథకాలను అందించటంలో వారధులుగా, సారథులుగా వ్యవహరిస్తున్న వలంటీర్, సచివాలయ వ్యవస్థలను వక్రీకరించి చూపటం హేయమన్నారు. ప్రజల్లో దిగజారిపోతున్న చంద్రబాబు ప్రతిష్టను నిలబెట్టేందుకు పచ్చమీడియా పడుతున్న తపన ఫలించదన్నారు. వచ్చే ఎన్నికల్లో మరో మారు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, సర్పంచ్ గంగుల రత్నవెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

వలంటీర్ వ్యవస్థపై దుష్ప్రచారం తగదు

- వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం
- మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్

పర్చూరు: వలంటీర్ వ్యవస్థపై తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారం తగదని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. వలంటీర్ వ్యవస్థపై జాతీయ కార్యదర్శి హోదాలో నారా లోకేష్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆమంచి కృష్ణమోహన్ ఖండిస్తూ శుక్రవారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవస్థపై నీకొక అభిప్రాయం, నాకొక అభిప్రాయం ఉండొచ్చు కానీ నిజం ఒకటే ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మనసులో నుంచి పుట్టిన మానస పుత్రిక వలంటీర్ల వ్యవస్థ అని అన్నారు. కేవలం గౌరవ వేతనం తీసుకొని కరోనాలో చేసిన సేవలను దేశం మొత్తం కొనియాడిందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఏఎన్ఎంలు, ప్రభుత్వ పారా మెడికల్ సిబ్బందితో కలిసి సేవలందించారని ప్రశంసించారు. కరోనాకు భయపడి రెండేళ్లపాటు రాష్ట్రంలో అడుగు పెట్టని చంద్రబాబు, కుమారుడు లోకేష్ ఈవిషయం గమనించాలని అన్నారు. కరోనా సమయంలో చనిపోయిన తర్వాత బంధువులు కూడా రాని సమయంలో వెళ్లి దహన సంస్కారాలు చేసి గొప్ప మనసు చాటుకున్న వ్యక్తులు వలంటీర్లని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అవుతారు.. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తారన్నారు. వలంటీర్ వ్యవస్థను రద్దుచేసి వీటి స్థానంలో పాత జన్మభూమి కమిటీలను తీసుకువస్తానని చెప్పే ధైర్యం చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణయం తీసుకుంటారన్నారు. 151 చోట్ల చంద్రబాబు ఓటమికి మొదటి కారణం జన్మభూమి కమిటీ సభ్యులని, ఈ కమిటీలే చంద్రబాబుకు ఉరితాళ్లు అయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకా ఆనందకుమారి, పర్చూరు మండల కన్వీనరు కఠారి అప్పారావు, కారంచేడు మండల కన్వీనర్ దండా చౌదరి, ఇంకొల్లు మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, మార్టూరు మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్

ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక



బాలుర జట్టు



బాలికల జట్టు

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను విక్టరీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించారు. కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 150 మంది బాలురు, 60 మంది బాలికలు హాజరయ్యారు.

కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వి.వీర్లంకయ్య, రిఫరీ బోర్డు చైర్మన్ పి.కృష్ణమూర్తి, జిల్లా సంయుక్త కార్యదర్శి డి.నాగాంజనేయరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎం.రాజశేఖరరెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు ఎస్.కృష్ణంరాజు పోటీలను పర్యవేక్షించగా, సెలక్షన్ కమిటీ సభ్యులుగా కె.తిరుపతిరావు, ఆర్.ఆంజనేయులు, కె.సత్యనారాయణ, ఎస్.గురుస్వామి, సురేంద్ర వ్యవహరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 నుంచి అనకాపల్లిలో జరగనున్న 70వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీర్లంకయ్య తెలిపారు.

బాలుర జట్టు

బి.విజయకుమార్, వై.నజీర్, ఓ.శ్రీహరి, ఏ.సురేష్, షేక్.బాజీ, జి.సైదా, సిహెచ్.లక్ష్మీనారాయణ, పి.గణేష్‌రెడ్డి, జి.శివశ్రీను, జే.అశోక్, పి.శ్యాంసన్, సిహెచ్.వసంతకుమార్, జె.అవినాష్.

బాలికల జట్టు

షేక్.ఫర్మానా, ఏ.మహిత, ఆర్.వాణికోటేశ్వరమ్మ, వి.సంధ్యాబాయి, జి.నందిని, ఎం.కావేరి, వై.అనూరాధ, పి.వైష్ణవి, బి.సౌజన్య, డి.హేమలత, ఎం.శిరీష, ఎం.సాత్విక.

డివైడర్‌ను ఢీకొట్టిన ఆటో

వంట మాస్టర్ మృతి



మృతుడు బంగారురాజు (రెడ్డి)

అద్దంకి: ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో వంట మాస్టర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన పట్టణంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. విజయనగరం జిల్లా భోగాపురం మండలం రెడ్డి కంచేరు గ్రామానికి చెందిన తాతారావు కుమారుడు బీ బంగారు రాజు అలియాస్ రెడ్డి (35) చిన్న వయసులోనే అద్దంకి వచ్చి హోటల్స్‌లో సర్వర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రస్తుతం ఒక మెస్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగకు విజయనగరం జిల్లాలోని స్వగ్రామానికి వెళ్లాడు. శింగరకొండ నుంచి ఆటోలో ఎక్కి వస్తుండగా, పట్టణంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సీఐ రాజమోహన్, ఎస్ఐ సమందర్‌వలి ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి చెల్లెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వివరాలను కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

టీబీ నివారణకు కృషి చేద్దాం

నరసరావుపేట: జిల్లాలో టీబీ నివారణకు ప్రైవేటు పల్మనాలజిస్టు విభాగ డాక్టర్లు, కెమిస్టు అండ్ డ్రగ్గిస్టులు సహకరించాలని టీబీ అండ్ లెప్రసీ జిల్లా పర్యవేక్షణాధికారి అధికారి డాక్టర్ కె.పద్మావతి కోరారు. గత నెల నుంచి టీబీపై సర్వే చేస్తున్న నేపథ్యంలో సబ్‌నేషనల్ సర్టిఫికేషన్ సర్వే డాక్టర్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్‌వో) ప్రతినిధి, ప్రొఫెసర్ డాక్టర్ విజయకృష్ణ జిల్లాలోని అధికారులు, ప్రైవేటు పల్మనాలజిస్టులు, డ్రగ్స్ అండ్ కెమిస్టు అధికారులతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వైద్యశాఖ ఆరోగ్యకార్యాలయంలో జరిగిన ఈ సదస్సులో డీఎండీహెచ్‌వో డాక్టర్ జి.శోభారాణి, టీబీ నివారణాధికారి డాక్టర్ పద్మావతి పర్యవేక్షించారు. డాక్టర్ విజయకృష్ణ గత ఐదేళ్లకాలంలో టీబీ కేసుల నివేదికలను పరిశీలించారు.

'వర్సిటీ' బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



నరసరావుపేటరూరల్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. వర్సిటీ పరిధిలోని గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి 12 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీలను ఎన్ఆర్ఐ డాక్టర్ ఎస్.శేఖర్, ప్రొవిడిన్స్ గ్లోబల్ సీనియర్ మేనేజర్ గడిపూడి రంగవల్లి, చిలకలూరిపేట నిఖిల టెక్నో స్కూల్ డైరెక్టర్ ఓలేటి శిరీష, ఎంఏఎం ఫార్మసీ కళాశాల కార్యదర్శి ఎంఆర్ శేషగిరిరావు ప్రారంభించారు. అతిథులు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులు మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా క్రీడల్లో పాల్గొనే విధంగా కళాశాలల యాజమాన్యాలు ప్రోత్సహించాలని సూచించారు. మొదటి రోజు పోటీల్లో తెనాలి జేఎంజే మహిళా కళాశాల, యూనివర్సిటీ కాలేజి ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్, ఎంఏఎం ఫార్మసీ కళాశాల, ధనలక్ష్మి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్లు పాల్గొన్నాయి. పోటీలకు సెలక్షన్ కమిటీ సభ్యులుగా జీపీఎంఆర్ నీలాకుమారి, డాక్టర్ సిహెచ్.వెంకట్రావు, కె.అరుణసుజాత వ్యవహరించారు. శనివారం ఫైనల్స్ నిర్వహించనున్నారు.